



# వైసీపీ ఇసుకాసురులు

ఇసుక ఎక్కడ కనిపించినా కొందరు వైసీపీ నేతలు వదలడం లేదు. ఇందుకోసం అడవులు, చెరువులు, కుంటలను జల్లెడ పట్టి మరీ ఇసుకను దోచేస్తున్నారు. మరికొందరైతే మట్టి నుంచి ఫిల్టరు ఇసుకను తయారు చేసి మరీ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందా కుప్పం నియోజకవర్గంలో యథేచ్ఛగా సాగుతోంది. దీనిపై టీడీపీ నాయకులు ఫిర్యాదులు చేసినప్పుడు మాత్రం అధికారులు అడపా దడపా దాడులు చేయడం, నామమాత్రపు జరిమానాలతో సరిపెడుతున్నారన్న విమర్శలున్నాయి. - రామకుప్పం



గుడుపల్లె మండలం యామిగానిపల్లెలో తయారు చేస్తున్న ఫిల్టరు ఇసుక


- చెరువులు, వంకల్లో మట్టినీ పిండేస్తున్నారు
- అడ్డుకున్న గ్రామస్తులపై దాడులు చేస్తున్నారు
- కుప్పం నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

## రామకుప్పంలో..

రామకుప్పం మండల పరిధిలోని కైండిన్య అభయారణ్యం ఇసుకాసురులకు అడ్డాగా మారిపోయింది. అభయారణ్యంలో ప్రవేశం చట్టప్రకారం నేరమైనా, అవేవీ వారు పట్టించుకోవడం లేదు. సింగసముద్రం చెరువును ఆనుకుని ఉన్న వంకలో ఉన్న అపార ఇసుక నిల్వలను పొక్లెయినర్లతో తవ్వేసి, నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో తమిళనాడుకు తరలిస్తున్నారు. గతంలో టీడీపీ నేతలు ఈ దందాను అడ్డుకున్నారు. కానీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇక్కడినుంచి ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ ఇద్దరు ప్రముఖులు కోట్ల రూపాయలను పోగేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. మరోవైపు నారాయణపురంతాండా అడవి నుంచి కూడా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. టీడీపీ నేతలు దీనిపై అటవీ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినప్పుడు మాత్రం అడపా, దడపా, ఒకట్రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకోవడం, జరిమానాలతో సరిపెడుతున్నారు.



రామకుప్పం మండలం సింగసముద్రం వద్ద ఇసుక తవ్వకాలు



శాంతిపురం మండలం సి.బండపల్లె క్వారీలో ఫిల్టరు ఇసుక తయారీ కేంద్రం

## అధికారుల సమక్షంలోనే ట్రాక్టర్లను తీసుకెళ్లిపోయారు

వారం కిందట బందార్లపల్లె పంచాయతీ గడ్డూరుయానాది కాలనీ సమీపంలోని అటవీ ప్రాంతంలో స్థానిక వైసీపీ నేతతో కలిసి ఓ ఎంపీటీసీ సభ్యుడు చేస్తున్న ఇసుక దందాను సమీప నాలుగు గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. దీంతో తన అనుచరులతో ఎంపీటీసీ సభ్యుడు సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. గ్రామస్తులను బెదిరించి, వారిపై దాడులకు పాల్పడ్డాడు. అంతేకాకుండా అటవీ అధికారుల సమక్షంలోనే రెండు ఇసుక ట్రాక్టర్లను అక్కడినుంచి తీసుకెళ్లిపోయారు. కాగా, గతంలోనూ కొందరు నేతలు ఇసుక దందాను అడ్డుకోవాలని చూసిన అటవీ అధికారులపై కూడా చేయిచేసుకున్నట్టు ప్రచారంలో ఉంది.

## శాంతిపురంలో..

శాంతిపురం మండలం శ్యామరాజపురం, గణేష్‌పురం, శివరామపురం సమీపాల్లోని పాలారు నది, వంకలు, పోడూరు, కొలమడుగు, చినగాండ్లపల్లె చెక్‌డ్యాం, చిన్నేటి వంకల నుంచి రోజూ ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. అధికారపార్టీకి చెందిన నేతలు కొందరు ఇసుక అక్రమ రవాణానే వృత్తిగా ఎంచుకున్నారు. పగలు, రాత్రీ తేడా లేకుండా ఇసుకను కర్ణాటకకు తరలిస్తున్నారు. మరోవైపు మండలంలోని చెరువుల్లో మట్టిని జల్లెడ పట్టి ఫిల్టరు ఇసుక తయారు చేస్తున్నారు. రాళ్ళబూదుగూరు, శ్యామరాజపురం, పోడూరు, సోమాపురం, కర్లగట్ట చెరువుల్లో, సీ.బండపల్లె క్వారీల గుంతల్లో ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రాలు నడుస్తున్నాయి.

## గుడుపల్లెలో...

గుడుపల్లె మండలంలో ఎక్కువగా ఫిల్టరు ఇసుక తయారీ సాగుతోంది. మండల పరిధిలోని యామిగానిపల్లె, శెట్టిపల్లె, బెగ్గిలపల్లె, కనమనపల్లె, గుండ్లసాగరం తదితర చెరువుల్లోని మట్టిని జల్లించి ఫిల్టరు ఇసుకను తయారు చేస్తున్నారు. ఈ ఇసుకను కుప్పం పట్టణంతో పాటు, కర్ణాటక సరిహద్దు గ్రామాలకు తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు.

## కుప్పం మండలంలో..

కుప్పం మండలంలోని కంగుంది సమీపంలోని పాలారు పెద్దవంకలో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అంతేకాకుండా కుప్పం పట్టణ శివార్లలోని పలుచెరువుల్లో ఫిల్టరు ఇసుక తయారీ కూడా సాగుతోంది. పెద్దవంకలో ఇసుక తవ్వకాలను పలుసార్లు అధికారులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. అధికారులు పెద్దవంకను సందర్శించిన ప్రతిసారీ.. ఇసుక అక్రమ రవాణాదారులు కొద్దిరోజులపాటు తవ్వకాలను ఆపేసి, మళ్లీ చెలరేగిపోతున్నారు.



కుప్పం మండలం పాలారు నది సమీపంలో ఇసుక తవ్వకాలు

# బలిజలకు ప్రాధాన్యమిచ్చే పార్టీకే మద్దతు

- బలిజ సేవా సంఘం నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 10: బలిజలకు ప్రాధాన్యమిచ్చే రాజకీయ పార్టీకే తమ మద్దతు ప్రకటిస్తామని బలిజ సేవా సంఘం నేతలు స్పష్టం చేశారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. చిత్తూరు అసెంబ్లీ స్థానాన్ని రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చి, తమ సామాజిక వర్గానికి చెందిన ప్రస్తుత ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు రాజ్యసభ సీటు ఇస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చి.. చివరి క్షణంలో మాటమార్చడం దారుణమన్నారు. అందుకు నిరసనగా తమ సామాజిక వర్గానికి చెందిన వారందరూ వైసీపీకి వ్యతిరేకంగా పనిచేయాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. బలిజల ఉనికిని దెబ్బతీసేవిధంగా వ్యవహరిస్తున్న వైసీపీకి తమ మద్దతును ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో తమ సామాజిక వర్గానికి ప్రాధాన్యమిచ్చే రాజకీయ పార్టీలకే మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బలిజ సేవాసంఘం నేతలు ఓఎం రామదాసు, బాలాజి, పూలచందు, రామ్మూర్తి, రవి నాయుడు, తులసీరాం, ఏకే రవి తదితరులు పాల్గొన్నారు.





మీడియాతో మాట్లాడుతున్న బలిజ సేవా సంఘం నాయకులు



రాజుపేట హంద్రీ-నీవా కాలువ వద్ద అధికారులతో చర్చిస్తున్న కలెక్టరు

# 16న రామకుప్పానికి సీఎం జగన్?

రామకుప్పం, ఫిబ్రవరి 10: సీఎం జగన్ ఈనెల 16న కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలంలో పర్యటించనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శనివారం రామకుప్పం మండలంలో కలెక్టరు షన్మోహన్, ఎస్పీ జాషువా పర్యటించారు. తొలుత వీరు వర్థికుప్పం వద్ద హంద్రీ-నీవా కాలువను పరిశీలించారు. అక్కడినుంచి తిమ్మసముద్రానికి వెళ్లి అక్కడి రామాలయ భూములను బహిరంగ సభా స్థలి కోసం పరిశీలించారు. చివరగా రాజుపేట వద్ద హంద్రీ-నీవా కాలువను పరిశీలించి, ఏర్పాట్లపై స్థానిక అధికారులతో చర్చించి, సూచనలిచ్చారు. వీరివెంట ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, తదితరులున్నారు.

# నగరిలో నేడు వైఎస్ షర్మిల పర్యటన

- భారీ ఏర్పాట్లు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నగరి, ఫిబ్రవరి 10: నగరి పట్టణ పరిధిలో ఆదివారం పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పర్యటించనున్నారు. దీంతో కాంగ్రెస్ నాయకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ఓంశక్తి దేవాలయం నుంచి నగరి టవర్‌క్లాక్ వరకు ర్యాలీగా వెళ్లి, అనంతరం జరిగే బహిరంగ సభలో ఆమె పాల్గొంటారు. ఈ నేపథ్యంలో శనివారం కాంగ్రెస్ నాయకులు జంగా గౌతమ్, రాకేష్‌రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, బాబు, భాస్కర్ చిరంజీవిరెడ్డి తదితరులు బహిరంగ సభాస్థలిని పరిశీలించారు. స్థానిక నాయకులకు పలు సూచనలిచ్చారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# కారు బోల్తా: వైద్య విద్యార్థి మృతి

తవణంపల్లె, ఫిబ్రవరి 10: కారు బోల్తా పడటంతో ఓ వైద్య విద్యార్థి మృతి చెందాడు. ఏఎస్‌ఐ రాజేంద్ర తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా ఒంటిమిట్టకు చెందిన వెంకటశివారెడ్డి కుమారుడు లిఖిత్‌కుమార్‌రెడ్డి(24) చిత్తూరులోని ప్రైవేట్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. అదే కాలేజీలో చదువుకునే స్నేహితులు పులి భరత్‌గణేష్‌రెడ్డి, వెంకటేష్ నాయక్, త్రిలోక్, మల్లా శశికుమార్‌లతో కలిసి శుక్రవారం రాత్రి ఐరాల మండలంలోని రిసార్టుకు కారులో వెళ్లాడు. శనివారం వేకువ జామున తిరిగి చిత్తూరు వస్తుండగా, తవణంపల్లె మండలంలోని సత్తారు బావి వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొని బోల్తా పడింది. లిఖిత్‌కుమార్‌రెడ్డి తలకు బలమైన గాయాలవగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం లిఖిత్‌కుమార్‌రెడ్డిని చిత్తూరును ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న త్రిలోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.



లిఖిత్‌కుమార్‌రెడ్డి మృతదేహం



బోల్తాపడిన కారు

# నేటినుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 10: ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆదివారం నుంచి ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయి. మొదటి సంవత్సరంలో 2,025 మంది, ద్వితీయ సంవత్సరంలో 5,461 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. వీరికోసం 76 పరీక్ష కేంద్రాలను గుర్తించారు. ఈనెల 20వ తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు జరుగుతాయని డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు. తనతోపాటు ప్రత్యేక అధికారిగా నియమితులైన దయానందరాజు ఈ పరీక్షలను పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు.



ప్రాక్టికల్స్‌కు సిద్ధమైన ల్యాబ్

# రూ.10,915.73 కోట్లతో నాబార్డు పీఎల్సీ ప్లాన్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 10: స్థానికంగా లభ్యమయ్యే వనరుల ఆధారంగా రూ.10,915.73 కోట్లతో పీఎల్సీ (పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్) ప్లాన్ రూపొందించిందని నాబార్డు డిస్ట్రిక్ డెవలప్‌మెంట్ మేనేజర్ సునీల్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నాబార్డు రూపొందించిన రుణ ప్రణాళిక ఆధారంగా జిల్లా బ్యాంకర్ల రుణ ప్రణాళిక 2024-25 సిద్ధమౌతుందని చెప్పారు. ప్రాధాన్యతా రంగాల్లో భాగంగా రుణప్రణాళికలో రూ.4835.21 కోట్లు కేటాయింపులు చేశామన్నారు. పంటల ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్‌కు రూ.3431.52 కోట్లు, యాంత్రీకరణకు రూ.160.49 కోట్లు కేటాయించామన్నారు. పట్టు, పండ్ల తోటల పెంపకానికి రూ.308.29 కోట్లు, అటవీ, బంజరు భూముల అభివృద్ధికి రూ.20.05 కోట్లు, పాడి పరిశ్రమకు రూ.557.11 కోట్లు, కోళ్ల పెంపకానికి రూ.72.68 కోట్లు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకానికి రూ.106.08 కోట్లు కేటాయించామని తెలిపారు. వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.117.61 కోట్లు, మార్కెట్ యార్డులు, గోదాములు, కోల్డ్ స్టోరేజ్‌లకు రూ.45.86 కోట్లు, భూచదును, భూసంరక్షణ, వాటర్ షెడ్ డెవలప్‌మెంట్‌కు రూ.29.06 కోట్లు, నూతన పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వర్కింగ్ కేపిటల్‌గా రూ.2039.27 కోట్లు, ఇన్వెస్ట్‌మెంట్ క్రెడిట్ కింద రూ.1368.18 కోట్లు కేటాయింపులు చేశారన్నారు. విదేశాలకు ఎగుమతులు చేసేందుకోసం రుణాల రూపేణ పారిశ్రామికవేత్తలకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు రుణప్రణాళికలో రూ.600 కోట్లు కేటాయింపులు చేశామని వివరించారు.



అంబులెన్స్‌లో సురక్షితంగా తల్లీబిడ్డ

# 108 అంబులెన్స్‌లో ప్రసవం

రామకుప్పం, ఫిబ్రవరి 10: రామకుప్పం మండలంలో ఓ తల్లి 108 అంబులెన్స్‌లో బిడ్డను ప్రసవించింది. రామకుప్పం మండల పరిధిలోని పెద్ద గెరిగపల్లెకు చెందిన గంగోత్రికి శనివారం ఉదయం పురిటి నొప్పులు వచ్చాయి. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది ఆమెను రామకుప్పం పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆమెకు నొప్పులు తీవ్ర కావడంతో సిబ్బంది ఆమెకు 108 వాహనంలోనే డెలివరీ చేశారు. గంగోత్రి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ సురక్షితంగా ఉన్నారు. డెలివరీ తర్వాత వారిని రామకుప్పం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి చేర్చారు.

# ఎంత కష్టమొచ్చింది?

- ఆరు నెలల్లోనే తల్లిదండ్రుల మృతి
- అంధకారంలో ముగ్గురు చిన్నారుల భవిష్యత్తు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న స్థానికులు

కల్లూరు, ఫిబ్రవరి 10: ముగ్గురూ ఎనిమిదేళ్లలోపువారే. ఆడుతూపాడుతూ గడపాల్సిన బాల్యం. కారణాలేమైనా ముందు తల్లి, ఆ తర్వాత తండ్రి మృతి చెందారు. ఆరు నెలల్లోనే తల్లిదండ్రులిద్దరూ తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో వీరి భవిష్యత్తు అంధకారమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పులిచెర్ల మండలం మంగళంపేట ఎస్టీ కాలనీకి చెందిన వంశీ (28) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇతను తొమ్మిదేళ్ల కిందట కడప జిల్లా రైల్వేకోడూరుకు చెందిన లక్ష్మీదేవిని పెళ్లి చేసుకున్నాడు. వీరికి సౌమ్య(8), హేమలత (5), వివేక్ (2)అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. దంపతుల మధ్య తలెత్తిన చిన్నపాటి గొడవతో గత ఏడాది ఆగస్టు 8వ తేదీన లక్ష్మీదేవి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. తల్లి లేకపోవడంతో సౌమ్య, హేమలతను వాళ్ల అమ్మమ్మ రైల్వేకోడూరుకు తీసుకెళ్లింది. వివేక్ మాత్రం నాన్నమ్మ వద్ద ఉంటున్నాడు. మరోవైపు వంశీకి కిడ్నీ సమస్య మొదలైంది. ఈ క్రమంలో తిరుపతి రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. శనివారం ఎస్టీకాలనీలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆరు నెలల కాలంలోనే తల్లిదండ్రులు మృతి చెందడంతో ముగ్గురు చిన్నారుల భవిష్యత్తును తలచుకుని స్థానికులు కంటతడి పెట్టారు. వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



హేమలత, సౌమ్య, వివేక్

# ఉభయదారులకు అధికారులు వ్యతిరేకం కాదు

- స్వామి చరిత్ర గ్రంథంలో ఉభయదారుల ప్రస్తావన చేస్తాం
- వరసిద్ధుడి ఆలయ చైర్మన్, ఈవో



సమావేశంలో ప్రసంగిస్తున్న చైర్మన్, ఈవో

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 10: ఉభయదారులకు అధికారులు వ్యతిరేకం కాదని కాణిపాక వరసిద్ధుడి ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు స్పష్టం చేశారు. శనివారం ఆలయ సమావేశ మందిరంలో వారు మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా వరసిద్ధుడి ఆలయానికి మాత్రమే ఉభయదారుల వ్యవస్థ ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి కూడా ఉభయదారులు ఎంతో పాటుపడ్డారన్నారు. స్వామి చరిత్ర గ్రంథ రచయితకు ఉభయదారుల వ్యవస్థ గురించి తెలియజేసినట్లు చెప్పారు. గ్రంథం పూర్తికాలేదని, కేవలం డ్రాఫ్టు మాత్రమే వచ్చిందన్నారు. ఎన్నికల కోడ్ వస్తుందన్న కారణంతో దీన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించామన్నారు. త్వరలో మూడువేల కాపీలు వస్తాయని, అందులో ఉభయదారుల గురించి రచయిత ప్రస్తావిస్తారన్నారు. ఏదేమైనా ఉభయదారులు ఆలయ కార్యాలయం వద్ద ధర్నా చేసి.. విధులకు ఆటంకం కల్పించడం సమంజసం కాదన్నారు. ఏ విషయాన్నైనా ఉభయదారులు నేరుగా తమతోనే చర్చించవచ్చని తెలిపారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.31 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.31 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 62,593 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 18,517 మంది తలనీలాలు సమర్పించారు.

## వెంకన్న సేవలో ప్రముఖులు


జయం రవి

తిరుమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, పుదుచ్చేరి ప్రభుత్వ విప్ ఆర్ముగం, తమిళ సినీనటుడు జయం రవి, ఎమ్మెల్సీ ఏసు రత్నం ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

## శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి రూ.10,00,116 విరాళం


ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ రామ్‌కు డీడీని అందజేస్తున్న దాతలు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 10 : స్విమ్స్‌లో నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందించే శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి బెంగళూరులో స్థిరపడిన గుంతకల్‌కు చెందిన రాచూరు వెంకట కిరణ్ ఆయన కుటుంబ సభ్యులు రూ.10,00,116(పది లక్షల నూట పదహార్లు) విరాళంగా అందించారు. ఈ మేరకు దాతలు డీడీని శనివారం స్విమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ రామ్‌ను కలిసి అందజేశారు. పేదల ఆరోగ్యానికి చేయూతనందించేందుకు ముందుకు వచ్చిన వెంకటకిరణ్, ఆయన కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ వరుణ్‌తేజ పాల్గొన్నారు.

## నేత్రదానం


సాయిరాం (ఫైల్ ఫొటో)

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 10: తిరుపతి జిల్లాలోని వెంకటగిరి మండలం యల్లంపల్లికి చెందిన సీహెచ్ సాయిరాం(33) కొంతకాలంగా అనారోగ్యంతో రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కంటి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ చలపతిరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను కలిసి నేత్రదానం ప్రయోజనాలను వివరించడంతో వారు అంగీకరించారు. వెంటనే సాయిరాం కళ్లను సేకరించి రుయాస్పత్రిలోని ఐబ్యాంక్‌కు తరలించారు. యువకుడి కుటుంబీకులను రుయా అధికారులు అభినందించారు.

## భార్యను చంపుతానంటూ
## మద్యం మత్తులో వీరంగం

● దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

పలమనేరు, ఫిబ్రవరి 10: భార్యను చంపుతానంటూ మద్యం మత్తులో కత్తితో వీరంగం చేసిన ఓ వ్యక్తికి గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. పలమనేరు మండలం కరిడిమడుగులో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కరిడిమడుగుకు చెందిన అమృతను నిమ్మనపల్లె మండలానికి చెందిన ఉమామహేశ్వరరెడ్డితో వివాహం జరిపించారు. మద్యానికి బానిసైన అతడు నాలుగురోజుల క్రితం మద్యం కోసం తాళిబొట్టు ఇవ్వలేదని భార్యతో గొడవపడి, కత్తితో నరికి తీవ్రంగా గాయపరిచాడు. విషయం తెలుసుకున్న ఆమె కుటుంబసభ్యులు ఉమామహేశ్వరరెడ్డిపై నిమ్మనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమృతకు చికిత్స చేయించి, పుట్టింటికి తీసుకొచ్చారు. పుట్టింట్లో ఉన్న భార్యను మళ్లీ చంపుతానంటూ శనివారం రాత్రి మద్యంతాగి కత్తి పట్టుకుని గ్రామంలో వీరంగం చేయడంతో గ్రామస్తులు అతడిని విద్యుత్ స్తంభానికి కట్టి దేహశుద్ధిచేశారు.

## నడక మార్గంలో పాము

తిరుమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల నడక మార్గంలో శనివారం ఓ పాము పట్టుబడింది. అలిపిరి మార్గంలోని మెకాళ్లమిట్ట వద్ద ఆరడుగుల పొడవు కలిగిన జెర్రిపోతు మెట్లపైకి వచ్చింది. గుర్తించిన భక్తులు, దుకాణదారులు పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని పామును పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

## నేడు అయోధ్యకాండ అఖండ పారాయణం

తిరుమల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ఆదివారం ఏడవ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం నిర్వహించనున్నారు. అయోధ్యకాండలోని 22 నుంచి 25 సర్గల వరకు ఉన్న 155 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 180 శ్లోకాలను ఉదయం 7 నుంచి 9 గంటల వరకు పారాయణం చేస్తారు. ఎస్వీబీసీలో ప్రత్యక్షప్రసారం చేస్తారు.

## ముగిసిన సంస్కృత సంభాషణ శిక్షణ

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 10: జాతీయ సంస్కృత వర్సిటీలో ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో పది రోజులపాటు నిర్వహించిన సంస్కృతసంభాషణ శిక్షణ శనివారంతో ముగిసింది. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ నగరవ్యాప్తంగాసంస్కృతశిబిరాలు నిర్వహించి, సంస్కృతభాషను ప్రజలకు చేరువ చేయాలని ఆకాంక్షించారు. ఎం.నరసింహాచార్యులు, ప్రొఫెసర్ కాదంబినీ, శేఖర్‌రెడ్డి, అలోక్‌మండల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# మరో అయోధ్యలా పేటమిట్ట

/ తీర్చిదిద్దుతామన్న గల్లా రామచంద్ర నాయుడు



పూతలపట్టు, ఫిబ్రవరి 10: కోట్లు సంపాదించినా.. జన్మనిచ్చిన ఊరిని మరువరాదు. సొంతూరికి ఏం చేశామన్న ఆలోచన అందరిలోనూ రావాలి. నా స్వగ్రామం 'పేటమిట్టను మరో అయోధ్యలా తీర్చిదిద్దడమే ధ్యేయం' అని అమరరాజా గ్రూపు సంస్థల వ్యవస్థాపకుడు గల్లా రామచంద్ర నాయుడు అన్నారు. శనివారం ఆయన పూతలపట్టు మండలం పేటమిట్టలో నిర్మిస్తున్న రామాలయ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. సంప్రదాయాలను పునరుద్ధరించడమేగాక ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలన్న ఉద్దేశంతో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఆయన మాటల్లోనే.. 'గ్రామస్తుల సహకారంతో 97 సెంట్ల భూమిని కొనుగోలు చేసి ఇక్కడ తొలుత విరూపాక్షమ్మ గుడిని నిర్మించాం. 2019 జనవరి 20వ తేదీన సొంత నిధులతో పాటు భక్తులు అందజేసిన విరాళాలతో సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి కొలువై ఉండేలా ప్రధాన ఆలయాన్ని నిర్మిస్తున్నాం. దీనికి ఓవైపు కృష్ణ మందిరం, మరోవైపు విఘ్నేశ్వర ఆలయం ఉంటాయి. గ్రామమంతా ప్రతిధ్వనించేలా భారీ గంటలు ఏర్పాటు చేస్తున్నాం. ఆలయ సముదాయంలో సమావేశాల నిర్వహణకు మినీ ఓపెన్ ఆడిటోరియం, సామూహిక కార్యక్రమాల కోసం కమ్యూనిటీ హాలు, చిన్నపిల్లల కోసం పార్కు ఉంటాయి' అని రామచంద్ర నాయుడు వివరించారు. ఇక ఆలయ పరిసరాల గుండా ప్రవహించే తేనేపల్లి చెరువు కాలువపై 160 మీటర్ల పొడవున కల్వర్టును నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. దీన్ని అమరరాజా గ్రూపు సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల నుంచి రూ.3.75 కోట్ల వ్యయంతో నిర్మించారని తెలిపారు.

**రేపటినుంచి కుంభాభిషేక మహోత్సవాలు**

కోదండరామస్వామి ఆలయ సముదాయానికి సోమవారం నుంచి నాలుగు రోజులపాటు కుంభాభిషేక మహోత్సవాలు జరుగుతాయని రామచంద్ర నాయుడు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అమరరాజా సంస్థలు పక్క రాష్ట్రాలకు వెళ్లడంపై, కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చిన నోటీసులపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. ఎటువంటి నోటీసులు ఇచ్చినా, తాము ఏ తప్పూ చేయలేదనే దృక్పథంతో ధైర్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు.ఏ పార్టీ అధికారంలో ఉన్నా తమ సంస్థలకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. తమ సంస్థల ఏర్పాటుతో పేటమిట్టకు ఇప్పటికే ప్రపంచంలోనే గుర్తింపు వచ్చిందన్నారు.సర్పంచ్ గల్లా రాధాకృష్ణ , పారిశ్రామికవేత్త గల్లా రాజశేఖర్ , పీఆర్వో లు బాబ్జీ, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## అధిక ధరకు మద్యం విక్రయం

● రూ.10 అదనంగా వసూలు చేసిన సేల్స్‌మాన్
● ఎస్ఈబీ అధికారులు కొట్టారంటూ పెట్రోలు పోసుకున్న సూపర్‌వైజర్
● చేయిచేసుకోలేదన్న ఎస్ఈబీ అధికారులు


ఎస్ఈబీ స్టేషన్ వద్ద మద్యం దుకాణాల సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 10: తిరుపతి నగరంలోని ఓ మద్యం దుకాణంలో సిబ్బంది అధిక ధరకు మద్యాన్ని విక్రయిస్తుండటాన్ని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. సదరు సేల్స్‌మాన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. చిత్తూరు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) ఆధ్వర్యంలోని విజిలెన్స్ అధికారులు శనివారం నగరంలోని పలు మద్యం దుకాణాల్లో రహస్య తనిఖీలు చేపట్టారు. అన్నమయ్య కూడలిలోని మద్యం దుకాణం నెంబరు 10025లో మద్యాన్ని కొనుగోలు చేశారు. సేల్స్‌మాన్ గౌతం బాటిల్‌పై రూ.10 అదనంగా వసూలు చేశారు. దీంతో ఎక్సైజ్ విజిలెన్స్ అధికారులు అతన్ని అదుపులోకి తీసుకుని తిరుపతి అర్బన్ ఎస్ఈబీ స్టేషన్‌కు తరలించి కేసు నమోదుకు సిఫారసు చేశారు. ఈలోపు అతనికి మద్దతుగా పలు మద్యం దుకాణాల సిబ్బంది ఎస్ఈబీ స్టేషన్‌కు చేరుకున్నారు. ఎస్ఈబీ సిబ్బంది అతనిపై చేయి చేసుకున్నారని, కేసు నమోదు చేయకుండా వదిలేయాలని అర్బన్ ఎస్ఈబీ సీఐ సుబ్బారెడ్డిని కోరారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు విషయం కొలిక్కి రాకపోవడంతో దుకాణ సూపర్‌వైజర్ జి.చరణ్‌కుమార్ ఒంటిపై పెట్రోలు పోసుకున్నారు. గౌతంపై కేసు నమోదు చేసినా, అతని ఉద్యోగానికి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐ సుబ్బారెడ్డి వారితో చర్చించి, ఉద్యోగానికి భరోసా ఇవ్వడంతో గౌతం, చరణ్‌కుమార్‌తో కలిసి సిబ్బంది వెనుదిరిగారు. కాగా, మద్యం దుకాణాల్లో తనిఖీ చేసి, సిబ్బందిని అదుపులోకి తీసుకునే అధికారం తమకు లేదని ఎస్ఈబీ సీఐ సుబ్బారెడ్డి ఆంధ్రజ్యోతికి చెప్పారు. ఏసీ విజిలెన్స్ బృందం తనిఖీలు చేసి గౌతంను తమ స్టేషన్‌కు తీసుకొచ్చారని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసే బాధ్యత తమదేనని అన్నారు. నిందితుడిని తాము కొట్టామని చెప్పడం అబద్ధమని అన్నారు.



నిందితుడు గౌతం - ఒంటిపై పెట్రోలు పోసుకున్న చరణ్‌కుమార్

## ముగిసిన పురందరదాసు ఆరాధన మహోత్సవాలు

తిరుమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మూడు రోజుల పాటు జరిగిన పురందరదాసు ఆరాధనా మహోత్సవాలు శనివారం ముగిశాయి. చివరి రోజు ఆస్థాన మండపంలో సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన, హరిదాస రంజని కళాకారులతో సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుంచి 3,500 మంది భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు సిద్ధం : కలెక్టరు


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరు

శాంతిపురం/రామకుప్పం, ఫిబ్రవరి 10: జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని కలెక్టరు సగిలి షన్మోహన్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనాకు తెలిపారు. శనివారం ఆయన శాంతిపురం మండల సచివాలయంలో వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. 2024 ఎన్నికల నిర్వహణకు జిల్లాలో అధికార యంత్రాంగం సిద్ధమవ్వాలని, ముందస్తు ప్రణాళికలను రూపొందించుకోవాలని ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల ఏర్పాటు, భద్రత, ఫొటో ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీపై శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి వివిధ అంశాల్లో ప్రాథమిక శిక్షణ అందించామని, పోలింగ్ కేంద్రాల్లో అన్ని కనీస వసతుల ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టరు ఆయనకు వివరించారు. అదేవిధంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు ఆయన తెలిపారు. భద్రత ఏర్పాట్ల విషయంలో ఎస్పీతో సమన్వయం చేసుకుని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తామని ఆయన వివరించారు.

## హోటల్ గదిలో యువకుడి ఆత్మహత్యాయత్నం

పలమనేరు, ఫిబ్రవరి 10: ప్రేమించిన యువతి తిరస్కరించడంతో ఓ యువకుడు గొంతుకోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఉదంతం పలమనేరులో శనివారం జరిగింది. పట్టణ సమీపంలోని ఓ హోటల్ వద్ద ఉన్న గదిని పూతలపట్టు మండలానికి చెందిన జయప్రకాష్ అనే యువకుడు నాలుగురోజుల క్రితం అద్దెకు తీసుకొన్నాడు. శనివారం మధ్యాహ్నం గదిలో జయప్రకాష్ రక్తపు మడుగులో పడివుండగా హోటల్ సిబ్బంది చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జయప్రకాష్‌ను పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్సకోసం వేలూరు సీఎంసీకి తరలించారు. పలమనేరు పోలీసులు విచారిస్తున్నారు.



# అద్భుతం... సృజనాత్మక దృక్పథం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10: గురువుల నేతృత్వంలో విద్యార్థుల సృజనాత్మకత వెల్లివిరిసింది. శ్రీకాళహస్తి జడ్పీ బాలుర హైస్కూల్లో శనివారం ప్రారంభమైన రెండు రోజుల జిల్లాస్థాయి ఇన్స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శనలో పలువురు విద్యార్థులు తమ ఆవిష్కరణలతో ప్రముఖుల మెప్పు పొందారు.దైనందిన జీవనంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించే సరికొత్త ఆలోచనలకు విద్యార్థులు శ్రీకారం చుట్టారు.ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఈవో శేఖర్,జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, సీఎంవో సురేష్, ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఎస్ఐఎం పరిశీలకులు మహ్మద్ రయిజ్, దివ్యాన్ష్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్ తదితరులు

### మద్యం సేవిస్తే బండి నడవదంతే



శ్రీకాళహస్తి పట్టణం బాబు అగ్రహారంలోని హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న పవన్ కుమార్. ఉపాధ్యాయురాలు వరలక్ష్మి పర్యవేక్షణలో ఈ ప్రయోగాన్ని ప్రదర్శించాడు.మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్న విషయం తెలిసిందే. వీటిని అరికట్టేందుకు ఆల్కహాల్ సెన్సార్, వాయిస్ సెన్సార్, మైక్రో కంట్రోలర్ పరికరాలతో సర్క్యూట్‌ను రూపొందించారు. వాహనంలోని ఇంజన్‌కు దీన్ని అనుసంధానం చేస్తారు. డ్రైవర్ మద్యం సేవించి సీట్లో కూర్చొగానే నోటి నుంచి వెలువడే వాసన, మాటల శబ్దాల నుంచి ఈ పరికరం మద్యం పరిమాణాన్ని గుర్తిస్తుంది. పరిమితి దాటినట్లు మైక్రో కంట్రోలర్ నిర్ధారణకు వస్తే వెంటనే ఇంజన్ దానంతట అదే ఆగిపోతుంది.డ్రైవర్ మారేవరకు వాహనం కదలదు.

### గుండెపోటును ముందుగానే గుర్తిస్తే



బుచ్చినాయుడు కండ్రిగ మండలం సహజ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న కార్తీక్ ఉపాధ్యాయుడు సురేష్ నాయుడు పర్యవేక్షణలో మంచి ప్రయోగాన్ని ప్రదర్శించాడు. ఇటీవల గుండెపోటుతో చాలామంది హఠాన్మరణం చెందుతున్న నేపథ్యంలో హృదయ స్పందనను ముందుగానే పసిగట్టి ఆ వ్యక్తికి అలారం రూపంలో హెచ్చరిక వస్తే వెంటనే వైద్యం పొందవచ్చు కదా అని ఆలోచించాడు. ఎలక్ట్రానిక్ సెన్సార్ ద్వారా గుండెపోటు సంభవించడానికి ముందు శబ్దంతో పాటు హృదయ స్పందనలో తేడాలను డిస్ప్లేలో ఈ పరికరం చూపుతుంది.

### రైలు పట్టాలపై విద్యుదుత్పత్తి



రేణిగుంట జడ్పీ హైస్కూల్లో టెన్త్ చదువుతున్న ఈ రవీంద్ర ఉపాధ్యాయుడు నాగరాజు సూచనలతో రైలు పట్టాలపై విద్యుదుత్పత్తి ప్రయోగాన్ని ఆవిష్కరించారు. పట్టాలపై రైలు చక్రాలు దొర్లే సమయంలో మెకానికల్ ఎనర్జీ ఉద్భవిస్తుంది. దీనినే కైనెటిక్ ఎనర్జీ అంటారు. రైలు పట్టాలపై డైనమో సిద్ధాంతం ద్వారా మెకానికల్ ఎనర్జీతో విద్యుదయస్కాంత శక్తిని ఉత్పత్తి చేయవచ్చు. దానిని ఏసీ కరెంటుగా నిల్వ చేసుకోవడం ద్వారా తిరిగి అవసరాలకు డీసీ కరెంటుగా కన్వర్ట్ చేసుకోవచ్చు. రైలు పట్టాలపై వృథాగా పోతున్న మెకానికల్ శక్తిని విద్యుత్ శక్తిగా మార్చే ఆలోచన ఇది.

### కునుకుతో ప్రమాదాలకు చెక్



చంద్రగిరి మండలం ఐతేపల్లి జడ్పీ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న నిహిత టీచరు సురేష్ పర్యవేక్షణలో కునికిపాట్లతో జరిగే రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టే ప్రయోగాన్ని ప్రదర్శించింది.కనురెప్పల కదలిక ఆధారంగా పనిచేసే కళ్ళజోడును రూపొందించింది.డ్రైవింగులో ఈ కళ్లద్దాలు ధరించి వాహనం నడుపుతున్నప్పుడు కునుకు తీస్తే వెంటనే అద్దాల నుంచి శబ్దంతో హెచ్చరిక వస్తుంది. అలాగే వైబ్రేషన్ రావడంతో డ్రైవరు అప్రమత్తం కావచ్చు.

## వైద్య శిబిరాలకు విశేష స్పందన



సదుం, ఫిబ్రవరి 10: బెంగళూరులోని వైదేహి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్, చెన్నైకు చెందిన శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో శనివారం సదుంలో జరిగిన ఉచిత వైద్య శిబిరాలకు స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. కంటి వైద్య శిబిరానికి 55 మంది హాజరుకాగా 18 మందిని శస్త్రచికిత్సల కోసం వైద్యులు ఎంపిక చేశారు. వీరికి ఉచిత రవాణా, భోజన సదుపాయంతో చెన్నైలోని శంకర్ నేత్రాలయంలో ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు వైద్యులు మురళి తెలిపారు. అలాగే గుండె పరీక్ష వైద్య శిబిరంలో 93 మంది పాల్గొనగా వైద్యులు వారికి అవసరమైన పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. వీరిలో ప్రత్యేక చికిత్సల కోసం 26 మందిని ఎంపిక చేసినట్లు వైదేహి ఆసుపత్రికి చెందిన ప్రముఖ హృద్రోగ నిపుణులు డా.దుర్గాప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైదేహి ఇన్స్టిట్యూట్ వైద్యులు, సిబ్బంది, సదుం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పుష్పకుమారి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ మణికంఠ అధ్యక్షులు లయన్ జయకుమార్ రెడ్డి, రాజారెడ్డి, చాముండేశ్వరి, నాగరాజా, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ




వి.కోట, ఫిబ్రవరి 10: 18ఏళ్ళు వయసు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదవ్వాలని సీసీ నాగరాజు అన్నారు. శనివారం వి.కోటలో సంఘమిత్రల ఆధ్వర్యంలో ఓటు విలువను తెలియజేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. రానున్న ఎన్నికలో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు వారి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు, సంఘమిత్రలు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే యువత భవిష్యత్తు : ఎమ్మెల్సీ కంచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, ఫిబ్రవరి 10: తెలుగుదేశంతోనే యువత భవిష్యత్తు ఉజ్వలంగా వెలుగుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోకేశ్ యువగళం పాదయాత్ర కవర్ కాని 125 నియోజకవర్గాల్లో శంఖారావం సభలు జరుగుతాయని చెప్పారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించి యువతను నిరాశానిస్పృలకు గురి చేశారని విమర్శించారు. శాసన మండలిలో 18 వేల టీచర్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పిన జగన్ ప్రభుత్వం కేవలం 6 వేల ఉద్యోగాలకే పరిమితం చేయడం దారుణమని, ఇది నిరుద్యోగ యువతను మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. కచ్చితంగా సీఎం 18 వేల టీచర్ పోస్టులను ఈ డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, కాణిపాకం వెంకటేశ్, మురళి పాల్గొన్నారు.

## రహదారి భద్రతా వారోత్సవాలపై ర్యాలీ

పలమనేరు : రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా శనివారం పలమనేరులో ఆర్టీసీ కార్మికులు డిపో మేనేజర్ స్వామి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగం ప్రమాదకరం అంటూ నినాదాలు చేశారు.

# అరాచక ప్రభుత్వాన్ని సాగనంపుదాం

మాజీ మంత్రి అమరనాథ రెడ్డి



పత్రపల్లెలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో అమరనాథ రెడ్డి

వి.కోట, ఫిబ్రవరి 10: ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కుతూ, అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపే రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. శనివారం వి.కోట పంచాయతీ పరిధిలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ ముద్రించిన కరపత్రాలను అందిస్తూ ముందుకు కదిలారు. టీడీపీ కార్యకర్తలమన్న నెపంతో తమకు సంక్షేమ ఫలాలు అందివ్వకుండా వేధింపులకు దిగారని పలువురు కార్యకర్తలు ఆయన ఎదుట ఆవేదనను వెళ్లిబుచ్చారు. ఈ ప్రభుత్వం గడచిన ఐదేళ్ళలో ప్రజలపై మోయలేని భారాన్ని వేసి అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని వివరించారు. అమరనాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసి మూడు రాజధానుల పేరిట ప్రజలతో ఆటలాడటం సరికాదన్నారు. ప్రజావ్యతిరేక విధానలకు పాల్పడుతున్న ఈ ప్రభుత్వానికి పాలించే అర్హత కోల్పోయిందన్నారు. యువగళం పాదయాత్రలో లోకేష్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావం పేరిట పర్యటించి ప్రభుత్వ దౌర్జన్యాలపై ప్రజలకు, కార్యకర్తలకు తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగనాథ్, ఈశ్వర్, రామచంద్ర నాయుడు, ధీరజ్, రాంబాబు, శబరీష్, సోము, నారాయణస్వామి, ముకుంద, రాము, విశ్వనాథ్, సతీష్, భక్తా, రామూర్తిఆచారి, కేశవరెడ్డి, వెంకట్రామప్ప, నాసీర్, రుహుల్లా, షేక్‌ఉమ్మర్, మునిరత్నం తదితరులు ఉన్నారు.

# రానున్న ఎన్నికలకు సంసిద్ధం కావాలి : గౌనివారి



సమావేశంలో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, ఫిబ్రవరి 10 : కార్యకర్తలకు, నేతలకు మధ్య ఉన్న సమన్వయ లోపాలను సరిచేసుకుని రానున్న ఎన్నికలకు సంసిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ్‌నాయుడు, మాజీ ఎంపీపీ నందిగం ఉదయకుమార్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి సుచించారు. శనివారం మండలంలోని కడపల్లె, కర్లగట్ట, కెనమాకులపల్లె, కొలమడుగు గ్రామ పంచాయతీల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండల స్థాయి నేతలు గ్రామ స్థాయి నేతలతో కలిసి గ్రామ పర్యటనలు చేస్తూ వారందరిని సమన్వయ పరచాలన్నారు. అందరు ఏకతాటిపైకివస్తే అధికార పక్షం పరారు కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నేతలు జని, చంద్రశేఖర్, పెద్దన్న, ఎల్.జయరామిరెడ్డి, ఆర్ఎస్ మణి, నారాయణస్వామి, రుద్రప్ప, బాస్కర్, గోపాల్, నాగరాజు, ఏఎంసీ నాగరాజు, నారాయణరెడ్డి, ఉయ్యాల జయరామిరెడ్డి, శ్యామల, రూప, సుగుణమ్మ పాల్గొన్నారు.

# చంద్రబాబుకు లక్ష మెజారిటీ కోసం కృషి



కుప్పం మండలంలో తెలుగు యువత సమావేశం

కుప్పం రూరల్, ఫిబ్రవరి 10: రాబోయే ఎన్నికల్లో చంద్రబాబుకు లక్ష మెజారిటీ తీసుకు రావడానికి యువత కృషి చేయాలని రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, క్లస్టర్ ఇన్‌ఛార్జి రామచంద్ర, నియోకవర్గ వన్యకుల క్షత్రియ యువత అధ్యక్షుడు సతీశ్ పిలుపునిచ్చారు. మండలంలోని కొట్టాలూరు, టి.సదుమూరు గ్రామాలలో శనివారం తెలుగు యువత సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సంజీవినాయుడు, కార్తీక్, చంద్రశేఖర్, ప్రకాశ్, గుణశేఖర్, అంజి, శివ, రాజువేలు, బెంగళూరు టీడీపీ ఫోరమ్ సభ్యుడు బాలాజీ, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**రామకుప్పం** : బెంగళూరు టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో శనివారం రామకుప్పం మండలం వీర్నమల, 89పెద్దూరులో తెలుగుయువత సామావేశాలు జరిగాయి. తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం మాట్లాడుతూ ఎన్నికలకు ముందు యువతకు ఇచ్చిన అన్ని హామీలను వైసీపీ తుంగలోకి తొక్కిందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మృగ్యమయ్యాయన్నారు. యువత భవిత బాగుపడాలంటే అది టీడీపీ పాలనలోనే సాధ్యమవుతుందన్నారు. ఆయా సమావేశాల్లో సనావుల్లా, ప్రకాష్, మాదేశ్‌నాయక్, సామూనాయక్, గోవిందరాజులు, మురళీనాయక్, భూపతి, భాస్కర్, లోకేశ్, రాజునాయక్‌యక్, రఘు, బెంగళూరు టీడీపీ ఫోరం సభ్యులు అనిల్, సతీష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## గాండ్ల కులస్తుల సభను విజయవంతం చేయండి

కుప్పం, ఫిబ్రవరి 10: టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న అఖిల గాండ్ల తెలికుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, యువ నాయకుడు వీజీ.ప్రతాప్ కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శనివారం కుప్పంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కుప్పం మండలం కమతమూరులోని దండుమారెమ్మ ఆలయ ఆవరణలో ఆరోజు ఉదయం 9.30గంటలకు సమావేశం జరుగుతుందన్నారు.



## రాజంపేట పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా దరఖాస్తు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి10: రాజంపేట పార్లమెంట్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని శనివారం విజయవాడ కాంగ్రెస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లు పి. రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ తనను పుంగనూరు నియోజకవర్గ కన్వీనర్‌గా పార్టీ ప్రకటించడంతో పుంగనూరు, మదనపల్లె, పీలేరు నియోజకవర్గంల్లో విస్తృతంగా ప్రచారం చేసినట్లు తెలిపారు. అలాగే కాంగ్రెస్‌పార్టీ పుంగనూరు నియోజకవర్గ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని పుంగనూరుకు చెందిన మెకానిక్ సజ్జాద్ విజయవాడలో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

## యువకుడి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 10: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం రామసముద్రం మండలంలో చోటుచేకుంది. రామసముద్రం మండలం ఎలకపల్లెకు చెందిన వెంకటప్ప కుమారుడు నరసింహులు(32) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో భార్య, భర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థలతో పురుగుల మందుతాగి స్పృహ కోల్పోయాడు. గుర్తించిన కుటుంబసభ్యులు పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు

పలమనేరు, ఫిబ్రవరి10 : పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో రానున్న నాలుగునెలల పాటు ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రమణారెడ్డి శనివారం పట్టణ తాగునీటి కోసం ఇప్పటి వరకు వున్న నీటి వనరుల పరిశీలనలో భాగంగా నాగమంగళం పంప్‌హౌస్‌ను, కాలువపల్లి రిజర్వాయర్‌ను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సందర్శించారు. రానున్న వేసవిలో తాగునీటి కోసం తగిన మేర అవసరమైతే కొత్తబోర్లు వేయడం, ఉన్నబోర్లను మరింత లోతుచేయడం, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ట్యాంకర్ల ఏర్పాటు, బోర్ల మోటర్లకు తగిన విధంగా స్పేర్ మోటర్లు సిద్ధంగా ఉంచుకోవడం వంటి చర్యలపై సూచనలిచ్చారు.

## ఆర్టీసీ సిబ్బందికి బహుమతులు



పుంగనూరు, ఫిబ్రవరి10: ఆర్టీసీ సంస్థకు ఆదాయం చేకూర్చిన ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులను పుంగనూరు ఆర్టీసీ డిపోమేనేజర్ సుధాకరయ్య అందజేశారు. శనివారం ఆర్టీసీ డిపో ఆవరణలో డ్రైవర్లు సలీం, శివయ్య, సి.రెడ్డెప్పలు డీజల్ ఆదా చేయడంతో వారిని అభినందించారు. వారితోపాటు కండక్టర్ పార్వతమ్మలకు ప్రోత్సహక బహుమతులు అందజేశారు.

## నీలగిరి చెట్లు దగ్ధం



పుంగనూరు, ఫిబ్రవరి 10: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అగ్గి మంటలు కింద ఉన్న గడ్డిపై పడడంతో జరిగిన ప్రమాదంలో నీలగిరి చెట్లు దగ్ధమైనట్లు ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపారు. శనివారం మండలంలోని గాంధీపురం, మాగాండ్లపల్లెలో అగ్నిప్రమాద సమాచారం రాగానే సిబ్బంది వెళ్లి పరిశీలించగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పడిన నిప్పుల వల్ల గడ్డి కాలి అగ్ని ప్రమాదం జరిగిందన్నారు. నంజుండప్ప, రేణుకా రాధయ్య చెట్లు కాలిపోగా వెంటనే మంటలను ఆర్పి మంటలు విస్తరించకుండా నివారించినట్లు ఆయన తెలిపారు.

## ఘనంగా బాటగంగమ్మ ఆలయ వార్షికోత్సవం



బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 10 : పట్టణంలోవున్న బాటగంగమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం అష్టోత్తర కలశాభిషేకం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు తిప్పయ్యాచార్యులు, శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారి గెరిగెకు విశేషాలంకరణ గావించి బాణసంచాపేలుళ్లు, కోలాటాలు, పండరిభజనలు, మేళతాళాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన

కుప్పం, ఫిబ్రవరి 10: మున్సిపాలిటీలోని 16వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ పరిశీలించారు. ఇక్కడ మురుగు కాలువల నిర్మాణాలు, సీసీ రోడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ఆంజనేయస్వామి గుడి ఛైర్మన్ కుమరేశన్, అరుణ్, సచివాలయ కన్వీనర్లు రాజా, మంజు, గంగమ్మ గుడి డైరెక్టర్ ఇందుశేఖర్ పాల్గొన్నారు.

## కంటి వైద్య శిబిరం విజయవంతం



కుప్పం, ఫిబ్రవరి 10: కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పీఈఎస్ వైద్య కళాశాల సౌజన్యంతో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. పరీక్షలు చేయించుకున్న వారిలో 30 మందిని కంటి శస్త్ర చికిత్సకోసం పీఈఎస్ వైద్యులు సిఫార్సు చేసినట్లు లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్‌పర్సన్ ఎ.మహేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కుప్పం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యేంద్రశేఖర్, కోశాధికారి ప్రసాద్, డాక్టర్ సునీల్‌రాజ్, కృష్ణమూర్తి, శివశంకర్, కేఈసీ లియో లయన్స్ క్లబ్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ గంగాధర్, పీఈఎస్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## జనసేన ఆర్థిక సాయం

రామకుప్పం, ఫిబ్రవరి 10: రామకుప్పం మండలం బండకొత్తూరుతాండాకు చెందిన జనసేన కార్యకర్త శివనాయక్ శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. జనసేన మండల అధ్యక్షుడు హరీష్, జిల్లాకార్యదర్శి రామ్మూర్తి, నేతలు శ్రీకాంత్, భాస్కర్, పవన్, సురేష్, సోమూనాయక్, రాజేష్‌నాయక్, తాంజిల్‌బాషా, బాబు, సంతోష్ తదితరులు శివనాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులకు పార్టీ తరపున రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

## వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి

సదుం, ఫిబ్రవరి 10: ప్రభుత్వ వైద్య సేవలను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సదుం మండలం చెరుకువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.గిరీషా సూచించారు. శనివారం ఆమె పీహెచ్‌సీలో మాట్లాడుతూ పీఎం మాతృత్వ వందన యోజన పథకం ద్వారా ప్రతి నెలా 9, 10 తేదీల్లో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్య సంరక్షణకు అందిస్తున్న ఆర్థిక సహాయాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పరిరక్షకులు ఉదయ భాస్కర్, నీలకంఠ, జానకి, శిఖామణి, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

సోమల, ఫిబ్రవరి 10: ద్విచక్ర వాహనం ఢీకొని మహిళకు తీవ్రంగా గాయపడింది. చౌడేపల్లె మండలం మోట్లపల్లెకు చెందిన సరసమ్మ తోటి కూలీలతో కలసి కూలి పనులకు వెళ్లి తిరిగి సాయంత్రం స్వగ్రామానికి బొలేరా వాహనంలో బయలుదేరారు. రాజీవ్‌కాలనీ బూరగమాను మిట్ట వద్ద వాహనంలో వెనుక కూర్చొన్న సరసమ్మను ద్విచక్రవాహనంలో వడ్డిపల్లెకు పోతున్న శివానంద వేగంగా వచ్చి ఢీకొన్నాడు. గాయపడిన సరసమ్మను సోమల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చికిత్సలు చేసి మెరుగైన వైద్యం కోసం పీలేరుకు తరలించారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి10: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ పూల ప్రేమ్‌కుమార్ తెలిపారు. శనివారం పుంగనూరు మండలం ఆరడిగుంట పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో కేంద్ర పథకాలు ముద్రించిన క్యాలెండర్లు ఇంటింటా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజల కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మంజునాథ్, నారాయణరెడ్డి, నాగరారెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సోమల** : కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పుంగనూరు నియోజకవర్గం కన్వీనర్ గన్నా మదన్‌మోహన్ బాబు తెలిపారు. శనివారం సోమల, గన్నావారిపల్లె, వడ్డిపల్లెలో పార్టీ క్యాలెండర్లు ఇంటింటా అందజేశారు. పల్లెకు పోదాం కార్యక్రమంతో కేంద్ర పథకాలను వివరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యుగంధర్, నవీన్ రాయల్, శీలం రామూర్తి, సురేంద్ర గుప్తా పాల్గొన్నారు.

## అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సోమల, ఫిబ్రవరి 10: ప్రజలు గ్రామాల వచ్చే కొత్త వ్యక్తులు, అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నరసింహులు కోరారు. శనివారం నంజంపేట, ఇరికిపెంటల్లో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సారా, మద్యం విక్రయాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మైనర్ పిల్లలకు ద్విచక్రవాహనాలు ఇవ్వరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో సర్పంచు రెడ్డెప్ప, ఖయ్యూం, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం పంపిణీ

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 10 : బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తల గురించి వైద్యసిబ్బంది అవగాహన కల్పించారు. ప్రతినెలా క్రమం తప్పకుండా గర్భిణులు వైద్యపరీక్షలు చేయించుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శాలిని, సీహెచ్‌వో అనురాధ, ఆరోగ్య విద్యాధికారి సావిత్రి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

గంగవరం, ఫిబ్రవరి 10 : ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని మధు, శ్రీవాణి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆ కళాశాలలో చిత్తూరు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రాక్తదానం చేసి వారి దయాగుణాన్ని చాటుకున్నారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులకు శ్రీపురం సీతారామయ్య, హెల్పింగ్ హ్యాండ్స్ శివకుమార్‌లు జ్యూస్, పండ్లు, బ్రెడ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహదేవ, డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లోకేశ్ శంఖారావం విజయవంతం కావాలి: టీడీపీ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 10: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈనెల 11వ తేదీ ఆదివారం నుంచి చేపట్టనున్న శంఖారావం కార్యక్రమం విజయవంతం కావాలని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి సురేంద్ర కుమార్, జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం జగన్ అప్రజాస్వామిక పాలన, వైసీపీ నేతల అక్రమాలు, అన్యాయాలు, దౌర్జన్యాలు, ఆక్రమణలు, దోపిడీలను ఎండగట్టడానికి పూరించిన ఎన్నికల శంఖారావాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. యువగళం పాదయాత్రలో లోకేశ్ పర్యటించని నియోజకవర్గాలలో శంఖారావం సభలు ఉంటాయని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సూపర్ సిక్స్ పథకాలను వివరించనున్నారని వారు ఆ ప్రకటనలో తెలిపారు.

## జగన్ అరాచకాలపై లోకేశ్ శంఖారావం: భానుప్రకాష్

నగరి, ఫిబ్రవరి 10: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకుల అరాచకాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, దాడులకు వ్యతిరేకంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం కార్యక్రమం చేపడుతున్నారని నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేలా ప్రజలను చైతన్యవంతులు చేయడమే శంఖారావం లక్ష్యమని ఆయన అభివర్ణించారు. లోకేశ్ యువగళం యాత్రతోనే వైసీపీలో వణుకు ప్రారంభమైందని, నేడు శంఖారావంతో నిరాశ, నిస్పృహలకు గురికాక తప్పదని భానుప్రకాష్ పేర్కొన్నారు.

## చంద్రబాబు సీఎం కాకుంటే భవిష్యత్తు అంధకారమే



కరపత్రాలను పంపిణీ చేస్తున్న మురళీమోహన్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 10: చంద్రబాబు నాయుడును సీఎం చేసుకోకుంటే మనందరి భవిష్యత్తు అంధకారమౌతుందని పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ అన్నారు. శనివారం మండలంలోని మహాసముద్రం గ్రామంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్‌పీ ధరణి నాయుడు, జయచంద్ర నాయుడు, జనార్ధన్ గౌడ్, రమేష్, మహేంద్ర, జయరామ్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, జగదీష్ రెడ్డి, సర్పంచ్ రమేష్, కుప్పాల మురళి, గోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పథకాలపై విస్తృత ప్రచారం కల్పిస్తాం: బీజేపీ



సంక్షేమ పథకాల క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 10: ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రచారం కల్పించడమే తమ లక్ష్యమని ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రికుమార్ అన్నారు. శనివారం మండలంలోని ఆళ్లమడుగు పంచాయతీ బుచ్చిరెడ్డికండ్రిగలో పల్లెపల్లెకు బీజేపీ.. గడప గడపకు కమలం.. పల్లెకి పోదాం రండి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఇంటింటికీ కరపత్రాలను అందించి, ప్రచారం కల్పించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## భవ్యశ్రీ కుటుంబానికి రూ.1.70లక్షల ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్సీ తదితరులు

పెనుమూరు, ఫిబ్రవరి 10: పెనుమూరు మండలంలోని రాణా వేణుగోపాలపురం గ్రామంలో ఇటీవల భవ్యశ్రీ అనే బాలిక అనుమానాస్పదంగా మృతిచెందిన విషయం తెలిసిందే. రాణా వేణుగోపాలపురంలో శనివారం భవ్యశ్రీ కుటుంబానికి గుంటూరు ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం తరపున రూ.లక్ష, వడ్డెర సంక్షేమ సంఘం నేతలు, వడ్డెర ఉద్యోగస్తుల కమిటీ తరఫున రూ.70వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసి, కుటుంబసభ్యుల్ని పరామర్శించారు. ఈకార్యక్రమంలో జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు మణి, వడ్డెర సంఘం మండలాధ్యక్షుడు పురుషోత్తం, వడ్డెర ఉద్యోగస్తుల కమిటీ సభ్యులు గుంజి శ్రీనివాసులు, తన్నీరు రాయల్, బాబు, దుర్గం రాధమ్మ, నేతలు భాస్కర్, పెద్దన్న, మనోహర్, కుమారి పాల్గొన్నారు.

## డంపింగ్‌యార్డును తనిఖీ చేసిన కమిషనర్



చిత్తూరు, ఫిబ్రవరి 10: నగరపాలక సంస్థ డంపింగ్‌యార్డును కమిషనర్ అరుణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డంపింగ్‌యార్డులో వ్యర్థాల నిర్వహణను పరిశీలించారు. యార్డులో ముందుకొచ్చిన వ్యర్థాలను వెంటనే వెనక్కు తరలించాలన్నారు. వ్యర్థాల ప్రాసెసింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. విండ్రో కంపోస్టు, వీర్మ కంపోస్టు యూనిట్లను పూర్తిస్థాయిలో నిర్వహించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను చిన్న ముక్కలుగా కత్తిరించే పల్వరైజేషన్ యంత్రం, ఇతర యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలన్నారు. డంపింగ్‌యార్డు ఖాళీస్థలంలో సేంద్రియ వ్యవసాయం తీరును పరిశీలించి విస్తరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## వన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 10: మండలంలోని దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం క్షీరాభిషేకం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు కె.కార్తీక్ అయ్యంగార్ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి క్షీరాభిషేకం, అర్చన, ప్రత్యేక పూజాది కార్యక్రమా నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకోగా, తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం అన్నప్రసాదం అందించారు. కార్యనిర్వాహకులు శివకుమార్ పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో వన వేణుగోపాలస్వామి



## మోసగాడి అరెస్టు

### - రూ.2లక్షల బంగారం స్వాధీనం



నిందితుడిని మీడియాకు చూపిస్తున్న సీఐ

చిత్తూరు, ఫిబ్రవరి 10: ఒంటరి మహిళలు, వృద్ధులకు మాయమాటలు చెప్పి వారి వద్ద నుంచి బంగారాన్ని దోచుకెళ్లిన ఓ వ్యక్తిని ఒకటవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఎస్‌ఐ షేక్షావలితో కలిసి సీఐ విశ్వనాథరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తిరుపతికి చెందిన మహేష్(35) చిత్తూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ... ఒంటరి మహిళలు, వృద్ధులకు పెన్షన్ ఇప్పిస్తానని నమ్మబలికేవాడు అని చెప్పారు. పెన్షన్ కోసం ఫొటోలు తీయాలని స్టూడియోకు తీసుకెళ్లి కమ్మలు, ఇతర బంగారు నగలు వేసుకుంటే పెన్షన్ రాదని చెప్పేవాడు. నగలను తీసిస్తే పట్టుకుంటానని చెప్పి, వారు లోపలికి వెళ్లిన వెంటనే నగలతో ఉడాయించేవాడు. దీనిపై చిత్తూరు ఒకటవ, రెండవ పట్టణ పోలీసుస్టేషన్ల పరిధిలో రెండేసి చొప్పున కేసులు నమోదయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిందితుడు మహేష్‌ను పట్టుకుని అతడి వద్ద నుంచి రూ.2 లక్షల విలువ చేసే 25 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

## 14న వసంత పంచమి

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 10: స్థానిక పొన్నియమ్మగుడిలో ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో జిల్లా వీహెచ్‌పీ నేతలు ఈనెల 14న వసంత పంచమి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అదే విధంగా స్థానిక కోదండరామాలయం, దుర్గాంబ ఆలయాల్లో కూడా నిర్వహించనున్నారు.

## భారత్ దివ్యాంగ పార్టీ నూతన కార్యవర్గం

చిత్తూరు, ఫిబ్రవరి 10: భారత్ దివ్యాంగ పార్టీ జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక ఎన్జీవో భవన్‌లో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకటేష్ (కుప్పం), ఉపాధ్యక్షుడిగా గిరి (బంగారుపాళ్యం), కార్యదర్శిగా గణేష్ (శ్రీరంగరాజపురం), సహాయ కార్యదర్శిగా రమేష్ (గుడిపాల), కోశాధికారిగా శరత్ (యాదమరి), కార్యవర్గ సభ్యులుగా భూపతి, లోకేష్, మంజునాథ్‌లను ఎన్నుకున్నారు. అలాగే జిల్లా మహిళా అధ్యక్షురాలుగా సుమతి, కార్యదర్శిగా కవిత, సహాయ కార్యదర్శిగా విమల, కోశాధికారిగా కాంచనలను ఎన్నుకున్నారు.

## జాబ్ క్యాలెండర్ ఏది...?: టీడీపీ

యాదమరి, ఫిబ్రవరి 10: ప్రతి జనవరికి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన జగన్ మాటమార్చారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వల్లేరు అమర్‌నాథ్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. పాదయాత్ర సమయంలో తనను సీఎం చేస్తే ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేసి 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తానని చెప్పారని, డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులను భర్తీ చేస్తానని చెప్పి ఐదేళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఒక్క పోస్టును కూడా ఎందుకు భర్తీచేయలేదని ప్రశ్నించారు. నిరుద్యోగులకు చంద్రబాబు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తే, జగన్ అధికారంలోకి వచ్చాక యువత కడుపుకొట్టిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

## సచివాలయం ప్రారంభం

విజయపురం, ఫిబ్రవరి 10: మండలంలోని కోసలనగరంలో నూతనంగా నిర్మించిన సచివాలయ, రైతు భరోసా భవనాన్ని శనివారం మంత్రి ఆర్కే రోజా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మయ్య, ఏఈఈ వీరభద్రం, ఆర్బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ కన్నెమ్మ, సర్పంచ్ ఉమామహేశ్వరి, మండల వైసీపీ కన్వీనర్ గోపీనాథ్ పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రతే ధ్యేయం



వీధిని శుభ్రం చేస్తున్న కాలనీవాసులు

చిత్తూరు, ఫిబ్రవరి 10: పరిసరాల పరిశుభ్రతే మనందరి ధ్యేయమని కాలనీవాసులు అన్నారు. శనివారం లాయర్స్ కాలనీ వాసు ఆధ్వర్యంలో మన కాలనీ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కేశవులు నాయుడు, సుధాకర్‌గుప్తా, రామకృష్ణమ నాయుడు, జయచంద్రారెడ్డి, వినాయకం, మోహన్‌రెడ్డిలతో పాటు మరి కొంతమంది కలసి కాలనీలోని వీధులను శుభ్రం చేశారు. ప్రతినెలా రెండో శనివారం కాలనీలో పారిశుధ్య కార్యక్రమాన్ని చేసుకుంటామని నిర్వాహకులు తెలిపారు.

## వైసీపీని ప్రజలు నమ్మరు: టీడీపీ

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 10: వైసీపీ ప్రభుత్వ బూటకపు విధానాలను, మోసపూరిత హామీలను ఇకపై ప్రజలు నమ్మే పరిస్థితిలోలేరని జిల్లా తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపల్లి ధనంజయ నాయుడు, పార్లమెంట్ టీడీపీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కామసాని కోదండరెడ్డి, నియోజకవర్గ టీడీపీ ముస్లిం మైనారిటీ ప్రధానకార్యదర్శి ఎస్.హెచ్.నియాజ్‌అలీ శనివారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. టీడీపీ అధినేత చంద్రబాబు పాల్గొంటున్న రా.. కదలిరా బహిరంగసభలను రాష్ట్రవ్యాప్తంగా అన్నివర్గాల ప్రజలు విజయవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. జగన్‌రెడ్డి అసమర్థ పాలనతో రాష్ట్రం 30ఏళ్లు వెనక్కిపోయిందని దుయ్యబట్టారు. రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలంటే చంద్రబాబు సీఎం కావాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు.

## హమాలీ కార్మికులకు హెడ్ లోడ్ చట్టాన్ని అమలుచేయాలి

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 10: ప్రభుత్వం హమాలీ కార్మికులకు హెడ్ లోడ్ చట్టాన్ని అమలు చేయాలని ఏఐటీయూసీ నేత నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం ఎస్టీయూ కార్యాలయంలో హమాలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షల మంది అసంఘటిత రంగంలో పని చేస్తున్నారని, మన రాష్ట్రంలోనే 25 లక్షల మంది పనులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. అలాంటి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి సంక్షేమ పథకాలను, రాయితీలను కల్పించకపోవడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో హమాలీలు పాల్గొన్నారు.

# బస్సుల్లేక ట్రాక్టర్లలో ప్రయాణం

● ప్రమాదాల బారిన ప్రజలు



ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న ప్రజలు

పాలసముద్రం, ఫిబ్రవరి 10: మండలంలో సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు అత్యవసర సమయాల్లో ఆటోలు, ట్రాక్టర్లలో ప్రయాణిస్తున్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం వల్ల ప్రమాదాలకు గురౌతున్నారు. మండలంలోని వనదుర్గాపురం, తిరుమలరాజుపురం, గంగమాంబాపురం, కోదండరామాపురం, నరసింహాపురం, బాలక్రిష్ణాపురం పంచాయతీలకు సరైన బస్సు సౌకర్యం లేదు. దీంతో ఆ గ్రామాల్లో వున్న ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఒక్కోసారి ట్రాక్టర్లలో ప్రయాణిస్తున్నారు. ట్రాక్టర్లలో ప్రయాణం సురక్షితం కాదని తెలిసినా, విధిలేని పరిస్థితుల్లో వారు గమ్యస్థానాలకు చేరుకోవడానికి ట్రాక్టర్లను ఆశ్రయిస్తున్నారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ చిత్తూరు-2 డిపో అధికారులకు, డిప్యూటీ సీఎం నారాయణస్వామికి విన్నవించినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సును నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణం పూర్తి చేయరా?



అసంపూర్తిగా ఉన్న రైతు భరోసా కేంద్రం

కార్వేటినగరం, ఫిబ్రవరి 10: ఆర్‌కేవీబీపేట పంచాయతీలో రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణం అసంపూర్తిగా ఉంది. భవన నిర్మాణం మోల్డింగు దశ వరకు వచ్చి ఆగిపోయింది. ఈ భవన నిర్మాణాన్ని సత్వరమే పూర్తి చేయటానికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. భవన నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో రాత్రిపూట అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా తయారైందని విమర్శలు ఉన్నాయి. భవన నిర్మాణం వెంటనే పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# ఖననాన్ని అడ్డుకున్నారు

● విజయనగర్ కాలనీ దళితుల ఆరోపణ ● ఆ స్థలం తనదంటున్న మరో వ్యక్తి
● రెవెన్యూ అధికారులు చర్చలు జరుపుతుండగానే ఖననం చేసిన కాలనీవాసులు



మృతదేహాన్ని ఖననం చేసిన కాలనీవాసులు



ఖననం చేయకుండా అడ్డుకున్న వ్యక్తితో మాట్లాడుతున్న ఆర్ఐ, పోలీసులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 10: నగర శివారు ప్రాంతమైన గంగాసాగరంలోని విజయనగర్ కాలనీ దళితవాడకు చెందిన చెన్నయ్య అనే వృద్ధుడు శనివారం మృతి చెందారు. ఆయన్ను ఖననం చేయడానికి బంధువులు, గ్రామస్తులు శ్మశానానికి తీసుకెళ్తే ఆ స్థలం తనదంటూ సైమన్ అనే వ్యక్తి అడుకున్నారు. దీంతో చిత్తూరు రెవెన్యూ అధికారులు, పోలీసులకు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు అక్కడకు వచ్చి చర్చలు జరుపుతుండగానే గ్రామస్తులు మృతదేహాన్ని ఖననం చేసి వెళ్లిపోయారు. ఈ స్థలంపై కొన్ని ఏళ్లుగా గొడవలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో ఆ కాలనీలో ఎవరు చనిపోయినా శ్మశానవాటికలో గొడవలు తప్పడం లేదు. అయితే తమ తాతల కాలం నుంచి మృతదేహాలను ఇక్కడే ఖననం చేస్తున్నామని.. ఇప్పుడు ఒక వ్యక్తి శ్మశాన వాటికను ఆక్రమించుకున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

## స్పానిష్ భాషలో 'విజయం' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు సరిఫ్టికేట్లు అందిస్తున్న దృశ్యం

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 10: స్పానిష్ భాషలో స్థానిక విజయం విద్యార్థులు ప్రతిభ కనపరచి అంతర్జాతీయ స్థాయిలో పేరుగడించారు. ఆన్‌లైన్ ద్వారా మూడు నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ముగింపు సమావేశం శనివారం కళాశాలలో నిర్వహించారు. స్పానిష్ బోధకుడు సిమోన్ డెల్ తోర్బియో, డెజర్టు సైడ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ శిక్షణ నిపుణులు ఆషిక్‌లతో కలిసి విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, ఈడీ శైలజామూర్తిలు దుబాయ్ ప్రభుత్వం గుర్తింపు పొందిన సంస్థ ద్వారా సరిఫ్టికేట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయంలోని విదేశీ భాష విభాగం నుంచి వివిధ భాషల్లో ప్రత్యేక శిక్షణ తీసుకోవడం ద్వారా తమ కళాశాలకు చెందిన విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు పొందే వీలైందన్నారు. ఫ్రెంచ్, జర్మన్, అరబిక్ భాషల్లో ప్రావీణ్యం పొందడం విద్యార్థుల ఉజ్వల భవిషత్తుకు మరింత తోడ్పాటు ఇస్తుందన్నారు. కళాశాల అధ్యాపకులు రమణ, జగదీష్, సతీష్ తదితరులు సర్టిఫికేట్లు పొందిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## నారగల్లు భూములపై హైకోర్టు స్టే

గుడిపాల, ఫిబ్రవరి 10: మండలంలోని నారగల్లు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నాగరాజు కుటుంబసభ్యులకు హైకోర్టులో ఊరట లభించింది. ఆయన కుటుంబసభ్యులకు చెందిన భూముల విషయంలో ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు స్టే ఇచ్చింది. వివరాల్లోకి వెళితే.. నారగల్లు గ్రామంలోని నాగరాజు కుటుంబ సభ్యులకు చెందిన భూముల్లో మంగళవారం రాత్రి రెవెన్యూ అధికారులు మామిడి చెట్లను నరికేసి, షెడ్లను తొలగించిన విషయం తెలిసిందే. 2006లో ప్రభుత్వమే తమకు పాసు పుస్తకాలు ఇచ్చిందని, ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఇలా చేయడం ఏమిటని నాగరాజు కుటుంబసభ్యులు ప్రశ్నించినా, అధికారులు సమాధానం ఇవ్వలేదు. దీంతో వారు గురువారం హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంగా ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోవద్దని, పూర్తిస్థాయిలో విచారించాలని శుక్రవారం హైకోర్టు స్టే ఇచ్చిందని నాగరాజు కుటుంబసభ్యులు తెలిపారు.

## రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తిచేయాలి: కమిషనర్

చిత్తూరు, ఫిబ్రవరి 10: నగరపాలక పరిధిలో ఇంటి స్థలాలు, గృహాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ అరుణ అధికారులు, వార్డు కార్యదర్శులను ఆదేశించారు. సాంబయ్య కండ్రిగ వార్డు సచివాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను శనివారం ఆమె తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరబాట్లు లేకుండా పూర్తి చేయాలన్నారు. లే అవుట్లు, లబ్ధిదారుల జాబితాను సరిచూసుకుని రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి మూడు రోజులే మిగిలి ఉన్నందున ఆలోపు పూర్తి చేయాలన్నారు. కమిషనర్ వెంట ఆర్వో గోపాలకృష్ణ వర్మ, హౌసింగ్ ఏఈ శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలు గుర్తించేందుకే 'పల్లెకు పోదాం'



వికసిత్ భారత్ సంకల్ప యాత్ర క్యాలెండర్‌ను ఇస్తున్న బీజేపీ నాయకులు

గుడిపాల, ఫిబ్రవరి 10: గ్రామాల్లో ప్రజలు సమస్యలు తెలుసుకోవడానికే పల్లెకు పోదాం కార్యక్రమానికి బీజేపీ శ్రీకారం చుట్టిందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు చిట్టిబాబు అన్నారు. శనివారం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు స్వామినాథ్ గౌడ్, దేవరాజ్, ఏలుమలై, సుధీర్ కుమార్, మురుగేష్, గోవిందరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే యువత భవిష్యత్తు : ఎమ్మెల్సీ కంచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, ఫిబ్రవరి 10: తెలుగుదేశంతోనే యువత భవిష్యత్తు ఉజ్వలంగా వెలుగుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్రలో పర్యటించని ప్రాంతాల్లో శంఖారావం సభలు జరుగుతాయని చెప్పారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించి యువతను నిరాశానిస్పృలకు గురి చేశారని విమర్శించారు. శాసన మండలిలో 18 వేల టీచర్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పిన జగన్ ప్రభుత్వం కేవలం 6 వేల ఉద్యోగాలకే పరిమితం చేయడం దారుణమని, ఇది నిరుద్యోగ యువతను మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. కచ్చితంగా సీఎం 18 వేల టీచర్ పోస్టులను ఈ డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, కాణిపాకం వెంకటేశ్, మురళి పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 10: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం రామసముద్రం మండలంలో చోటుచేసుకుంది. రామసముద్రం మండలం ఎలకపల్లెకు చెందిన వెంకటప్ప కుమారుడు నరసింహులు(32) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో భార్య, భర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థలతో పురుగుల మందుతాగి స్పృహ కోల్పోయాడు. గుర్తించిన కుటుంబసభ్యులు పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## నీలగిరి చెట్లు దగ్ధం

పుంగనూరు, ఫిబ్రవరి 10: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అగ్గి మంటలు కింద ఉన్న గడ్డిపై పడడంతో జరిగిన ప్రమాదంలో నీలగిరి చెట్లు దగ్ధమైనట్లు ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపారు. శనివారం మండలంలోని గాంధీపురం, మాగాండ్లపల్లెలో అగ్నిప్రమాద సమాచారం రాగానే సిబ్బంది వెళ్లి పరిశీలించగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పడిన నిప్పుల వల్ల గడ్డి కాలి అగ్ని ప్రమాదం జరిగిందన్నారు. నంజుండప్ప, రేణుకా రాధయ్య చెట్లు కాలిపోగా వెంటనే మంటలను ఆర్పి విస్తరించకుండా నివారించినట్లు తెలిపారు.

## ఘనంగా బాటగంగమ్మ ఆలయ వార్షికోత్సవం

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 10: పట్టణంలోవున్న బాటగంగమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం అష్టోత్తర కలశాభిషేకం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో



విజయపురం, ఫిబ్రవరి 10: మండలంలోని పన్నూరు, జగన్నాథపురం, విజయపురం పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో వెంకటరెడ్డి శనివారం పరిశీలించారు. విద్యుత్, ర్యాంప్, మరుగుదొడ్డి సదుపాయంపై ఆరా తీశారు. అనంతరం పన్నూరు, జగన్నాథపురం సచివాలయాలను సందర్శించి కొత్తగా ఇచ్చిన ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జునరావు, రెవెన్యూ సిబ్బంది, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 10: స్థానిక బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద వున్న అన్న క్యాంటీన్‌లో శనివారం గుంతూరు గ్రామానికి చెందిన సుదర్శన్ నాయుడు కుమార్ భాష్యం అఖిల్ భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భాష్యం వంశీ చౌదరి, గోపి నాయుడు, రమేష్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయం వద్ద అన్నదానం



కార్వేటినగరం, ఫిబ్రవరి 10: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద శనివారం వంద మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయం వద్ద అన్నదానం చేసేందుకు ఆసక్తి ఉన్న భక్తులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ సూచించారు.

# ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో...?



రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

గుడిపాల, ఫిబ్రవరి 10: మండలంలోని చెరుకూరికండ్రిగ గ్రామం వద్ద వర్షం భారీగా పడినప్పుడు నీరు చెరుకూరికండ్రిగ నుంచి రాసనపల్లి వంకకు వెళ్తుంది. ఆ వంకను దాటాలంటే ఏమాత్రం తాత్సారం చేసినా పడి గాయాలపాలవ్వాల్సిందే. చెరుకూరికండ్రిగ నుంచి వయా గుర్రాల మిట్ట వెళ్లే రహదారిలో ఈ నీరు పోవడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. అక్కడ మినీ బ్రిడ్జిని ఏర్పాటు చేయడమో లేక రోడ్డు కిందవైపు రింగులు వేసి నీరు సాఫీగా వెళ్ళేవిధంగా చూడాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.